# ఒత్తిడిని జయించి పదిలో విజయం సాధించండి

### ప్రముఖ సైకాలజిస్ట్ అడ్డిగ శ్రీనివాస్





**భీమదేవరపల్లి/మార్చి4 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం బుధవారం ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్ అడ్డిగ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో విజయం సాధించాలంటే ముందుగా పరీక్షల పట్ల ఉన్న భయం, ఒత్తిడిని జయించాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షలను భయంగా కాకుండా అవకాశంగా భావించాలని సూచించారు. సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా చదవాలని, ముఖ్యాంశాలను నోట్స్ రూపంలో సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అలాగే సమయపాలన ఎంతో కీలకమని, చదువు విశ్రాంతి సమయాలను సమతుల్యం చేసుకోవాలని వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, ఫైళ్లు, పెన్నులు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పచ్చునూరి సురేష్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పి. జ్యోతి మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# స్వర్గీయ ఉమా మహేశ్వర్ స్మారక సభలో భావోద్వేగ నివాళులు





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ లోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో సేవలందించిన గౌరవనీయ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ స్వర్గీయ ఉమా మహేశ్వర్ స్మారక సభను ఈ రోజు నిర్వహించారు. సమావేశానికి జెడ్పీహెచ్ఎస్ బాలుర ధర్మసాగర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్.ఎం కె.బి. ధర్మప్రకాశ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి డా. రామ్‌ధన్, జెడ్పీహెచ్ఎస్ బాలికల ధర్మసాగర్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ మురళి, జెడ్పీహెచ్ఎస్ యూనికిచర్ల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మీ మనోహర్ స్వామి, ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జ్యోతి ఎలియా, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో మాట్లాడిన వక్తలు స్వర్గీయ ఉమా మహేశ్వర్ సేవలను హృదయపూర్వకంగా స్మరించుకున్నారు. ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా ఆయన చేసిన సేవలు అపారమని కొనియాడారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిన మమకారం, క్రమశిక్షణపై ఆయనకున్న నిబద్ధత, సాహిత్యరంగం మరియు మానసిక శాస్త్రంపై ఆయనకున్న పట్టు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అనేక మంది పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాస దశలో ఆయన ఇచ్చిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం, ప్రేమను భావోద్వేగంతో స్మరించుకున్నారు. "ఆయన కేవలం ఒక హెడ్‌మాస్టర్ మాత్రమే కాదు, మా జీవితాలకు దారిచూపిన దీపస్తంభం" అని వారు అభివర్ణించారు. సభ ప్రారంభంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌనంతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. స్వర్గీయ ఉమా మహేశ్వర్ సేవలు, స్ఫూర్తి, సాదాసీదా జీవనం, ఉన్నత ఆలోచనలు ఎప్పటికీ మాతోనే ఉంటాయని సభలో పాల్గొన్న వారందరూ భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని సంకల్పించారు.

# కొమ్మాల జాతరకు కదిలిన కాంగ్రెస్ ప్రభ బండ్లు

### కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట,/ మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):** గీసుకొండ మండలం కొమ్మాలలో జరిగే కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం జాతరను పురస్కరించుకొని నర్సంపేట నియోజకవర్గం నుంచి వందలాదిగా కదిలిన కాంగ్రెస్ పార్టీ ప్రభ బండ్లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. జాతర ఉత్సాహంతో నిండిన వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ హోలీ పర్వదినం నుంచి ప్రారంభమయ్యే కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి జాతరకు నర్సంపేట నియోజకవర్గంతో పాటు వరంగల్ జిల్లాలో ప్రభ బండ్లు కట్టే ఆనవాయితీ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నియోజకవర్గంలోని వందలాది గ్రామాల నుంచి ప్రభలు కట్టి భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనడం ఆనందదాయకమని తెలిపారు. లక్ష్మీ నరసింహ స్వామి మహిమాన్విత దైవమని, ఆయన కరుణాకటాక్షాలతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. స్వామివారి దీవెనలతో నర్సంపేట నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున గ్రామాల నుంచి మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భజా భజంత్రీల నడుమ, పార్టీ పాటలతో నృత్యాలు చేస్తూ ప్రభ బండ్ల వెంట ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతర వాతావరణం భక్తి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.

# మహిళా దినోత్సవం సందర్భంగా 'హోలిస్టిక్ న్యూట్రిషన్' కోర్సు ముగింపు

### విద్యార్థినుల తల్లులకు ఘన సన్మానం






**నర్సంపేట,/ మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేట మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "హోలిస్టిక్ న్యూట్రిషన్ అండ్ వెల్‌బీయింగ్" (సంపూర్ణ పోషకాహారంఆరోగ్యం) సర్టిఫికెట్ కోర్సు ముగింపు వేడుక ఉత్సాహభరితంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండం లక్ష్మీ రామానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త రజిత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గత నెల రోజులుగా సాగిన ఈ కోర్సులో విద్యార్థినులతో పాటు వారి తల్లులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని పోషకాహారం, మానసిక ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పొందారు. కుటుంబ ఆరోగ్యానికి మూలస్తంభాలైన మహిళలకు సరైన ఆహారపు అలవాట్లు, జీవన శైలి మార్పులు, మానసిక సమతుల్యత ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ మహిళా సాధికారత ఆరోగ్యంతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమగ్ర పోషణ అనేది కేవలం ఆహారం పరిమితమే కాకుండా శరీరం, మనస్సు, ఆత్మల సమతుల్యతపై ఆధారపడిందన్నారు. సూక్ష్మపోషకాలు కలిగిన సహజ సిద్ధమైన ఆహారం తీసుకోవడం, ప్రాసెస్ చేసిన పదార్థాల కంటే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందుతుందని సూచించారు. ముఖ్య అతిథి పెండం లక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా పోషకాహారంపై అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమన్వయకర్త రజిత మాట్లాడుతూ పోషకాహార అవగాహన ప్రతి ఇంటికీ చేరాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసి, పాల్గొన్న తల్లులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఏటిడిఓ.





**బయ్యారం/మార్చి 4(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను కొత్తగూడ ఏటిడిఓ భాస్కర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి,ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత ప్రీ-ఫైనల్ పరీక్షలను పరిశీలించి,విద్యార్థుల విద్యా పురోగతిపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి,తుది పరీక్షలకు విద్యార్థులను మెరుగ్గా సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం స్టోర్‌రూమ్, టాయిలెట్స్, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి,పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా. బి. శోభన్ బాబు,వర్డెన్ కె. లాలయ్య,ఎస్‌సీఆర్‌పీ జి. భద్రు, హీరాసింగ్, శ్రీను, వీరు,కాంతారావు,రవి,ఫిజికల్ డైరెక్టర్ వాలు, కృష్ణవేణి,తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

# మిట్టపల్లిలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ పోటు స్వప్న శరత్



**తల్లాడ/మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం పరిధిలోని మిట్టపల్లి గ్రామపంచాయతీలో సిసి రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ పోటు స్వప్న శరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలకు సిసి రోడ్లు మంజూరు కావడంలో కీలక పాత్ర పోషించిన ప్రజాప్రతినిధులు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సిసి రోడ్లు నిర్మాణం వల్ల గ్రామ ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా మారుతాయని, అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వంగర పోలీస్ స్టేషన్‌లో హోలీ సంబరాలు




**భీమదేవరపల్లి/మార్చి4 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో బుధవారం హోలీ పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్, ఉప సర్పంచ్ ఒల్లాల రమేష్, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి వంగర పోలీస్ స్టేషన్‌లో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వంగర ఎస్ఐ దివ్య మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజలు శాంతి, సామరస్యంతో పండుగను జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సృజన, ఉప సర్పంచ్ ఒల్లాల రమేష్, వార్డు సభ్యులు, మేఘన ఉమెన్స్ సొసైటీ వెల్ఫేర్ చైర్మన్ సుహాసిని, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్రవంతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీ రామెజు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జెల రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మర్రి దేవరాజు, సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ యాదవ సంఘం ఉపాధ్యక్షుడు మారం సతీష్, బత్తిని అశోక్, కాల్వ సంపత్, బత్తిని రాజు, రామారపు మైసయ్య, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తిలో లైన్ మెన్ డే వేడుకలు ఘనంగా నిర్వహణ



**రాయపర్తి/మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం లైన్ మెన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న లైన్ మెన్ బడితపురం వెంకన్నను స్థానిక ఏఈ కుంట శ్రీధర్ శావువతో కలిసి ఘనంగా సన్మానించారు. విద్యుత్ సరఫరా నిర్వహణలో లైన్ మెన్‌ల సేవలు కీలకమని, ఎండవానలను లెక్కచేయకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ అందించేందుకు వారు కృషి చేస్తున్నారని కార్యక్రమంలో ప్రసంగించిన అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, బి. కిషన్, ఏ. రామ్మూర్తి, ప్రభాకర్, బీమా, రవి, రాజశేఖర్, రమేష్, రామకృష్ణ, సారయ్య, మహేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# జింకురాం తండాలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



**రాయపర్తి/మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం పరిధిలోని జింకురాం తండా గ్రామంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను బుధవారం గ్రామ సర్పంచ్ గుగులోత్ సునీత శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు వల్ల గ్రామంలో రాత్రి వేళల్లో ప్రజలకు సౌకర్యం కలుగుతుందని, భద్రత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్య సర్వన్, వార్డ్ సభ్యులు గుగులోత్ శ్రీను (1వ వార్డ్), గుగులోత్ మైబు (2వ వార్డ్), లకవత్ సురేష్ (3వ వార్డ్), భూక్య జ్యోతి (4వ వార్డ్), మలోతు సునీత (5వ వార్డ్)తో పాటు యాకు నిమ్య రవి, ప్రశాంత్, మనోజ్, ధర్మ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ





**భీమదేవరపల్లి/మార్చి4 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి ఈజీఎస్ నిధుల ద్వారా పనులు చేపట్టేందుకు బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం అవసరమని గ్రామస్థులు కోరగా, అధికారులు స్పందించి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం, సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఏఈ వినయ్ రెడ్డి, జడ్పి హెచ్ఎస్ మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు సంధ్య, అశోక్, వెంకటేశ్వర్లు, శ్యామ్ తదితరులు హాజరయ్యారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని అధికారులు సూచించారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని స్వాగతించి ఆనందం వ్యక్తం చేశారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేసిన సర్పంచ్ చిర్ర వేణు



**రాయపర్తి/మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం పరిధిలోని మైలారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక సర్పంచ్ చిర్ర వేణు జ్యామెట్రీ బాక్సులు, పరీక్ష ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ వేణు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పదవ తరగతిలో శాతం శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అవసరమైన విద్యా సామగ్రి అందించడం ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, గ్రామస్తులు చిర్ర మల్లయ్య, చెవ్వ కాసినాదం, బండా యాదగిరి తదితరులు పాల్గొన్నారు.ద

## రిటైర్డ్ ఏఆర్ కానిస్టేబుల్ ఎం.డి. గౌసుద్దీన్ మృతి

### పోలీసు వర్గాల్లో విషాదం



**ఎల్కతుర్తి, /మార్చి4 (జర్నలిస్ట్ వార్త:)**
హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఆర్ (ఆర్మ్డ్ రిజర్వ్) కానిస్టేబుల్ ఎం.డి. గౌసుద్దీన్ బుధవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల ఎల్కతుర్తి పోలీసు వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో విధులు నిర్వహించిన గౌసుద్దీన్ హెడ్‌క్వార్టర్స్‌లో సేవలందిస్తూ ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఏటూర్ నాగారం, కాజీపేట, ములుగు, వర్ధన్నపేట పోలీస్ స్టేషన్లలో కూడా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.ఆయన మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటుగా మారిందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు.గౌసుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని స్థానికులు ప్రార్థించారు.

## ఎల్కతుర్తి మోడల్ పాఠశాలలో 10 మంది విద్యార్థులు డిబార్

### మ్యాథ్స్ పరీక్షలో నకలు రాస్తూ పట్టుబడిన విద్యార్థులు

**ఎల్కతుర్తి, /మార్చి 4 (జర్నలిస్ట్ వార్త:)**
హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఇంద్రనగర్ శివారులోని మోడల్ పాఠశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో బుధవారం 10 మంది విద్యార్థులను డిబార్ చేశారు.ఇంటర్ రెండో సంవత్సరం మ్యాథ్స్ పరీక్ష సందర్భంగా కొంతమంది విద్యార్థులు నకలు రాస్తున్నట్లు స్పెషల్ స్క్వాడ్ గుర్తించింది. తనిఖీల్లో పట్టుబడిన 10 మందిని పరీక్షల నుంచి వెంటనే డిబార్ చేసినట్లు అధికారులు తెలిపారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రాధికారులు హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నట్లు వెల్లడించారు

## నూతన వరుడికి అక్షింతలు వేసి దీవించిన కాంగ్రెస్ నాయకులు



**తల్లాడ,/ మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని బిల్లుపాడు గ్రామంలో వివాహ శుభకార్య సందడి నెలకొంది. దీవెల వెంకటేశ్వరరావు ఝాన్సీ దంపతుల కుమారుడు చిరంజీవి గోపీచంద్ వివాహ వేడుక సందర్భంగా కాబోయే నూతన వరుడికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్షింతలు వేసి దీవించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రత్యేకంగా హాజరై వరుడిని ఆశీర్వదించి, జీవితంలో సుఖశాంతులతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాప సుధాకర్, సర్పంచి కృష్ణవేణి, సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, జక్కంపూడి చంద్రశేఖర్, సర్పంచ్ తోట రామారావు, మాజీ సర్పంచ్ కొమ్మినేని విద్యాసాగర్, మాజీ ఎంపీటీసీ గోవింద శ్రీనివాసరావు, జక్కంపూడి కిషోర్, రామారావు వెంకటేశ్వర్లు, రాయల రాము, రామ్ అప్పారావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.గ్రామంలో వివాహ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి.

## ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న చిట్టి రామచిలుకకు ప్రాణదానం

### స్థానికుడు షేక్ ఇమామ్ చాకచక్యంతో రక్షణ




**నర్సంపేట, /మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామంలో మానవత్వానికి నిదర్శనంగా నిలిచిన ఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం బయలుదేరిన స్థానికుడు షేక్ ఇమామ్ రహదారి పక్కన మొక్కజొన్న పొలంలో వేసిన వలలో చిక్కుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న చిట్టి రామచిలుకను గమనించాడు.ఆహారం కోసం వచ్చి వలలో చిక్కుకున్న ఆ పక్షి బయటపడేందుకు తంటాలు పడుతుండగా వెంటనే స్పందించిన ఇమామ్ జాగ్రత్తగా వలను విప్పి రామచిలుకను రక్షించాడు. కొంతసేపు సంరక్షణలో ఉంచి అనంతరం స్వేచ్ఛగా ఎగిరేలా వదిలిపెట్టాడు.స్థానికులు షేక్ ఇమామ్ చూపిన చాకచక్యాన్ని, మానవత్వాన్ని అభినందించారు. కనుమరుగవుతున్న రామచిలుకలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామస్తులు పేర్కొన్నారు.

## సింగారంలో ఘనంగా హోలీ సంబరాలు.




**బయ్యారం/మార్చి 4(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం సింగారం గ్రామంలో బుధవారం హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పిఆర్ టియూ మండల అధ్యక్షులు మోహన్ నాయక్ పాల్గొన్నారు. గ్రామంలోని బిఆర్ఎస్ శ్రేణులు, యువకులు,రైతులు, విద్యార్థులు ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు.ఈ వేడుకల్లో సింగారం మాజీ సర్పంచ్ బానోత్ కోటి మాట్లాడుతూ హిందూ పురాణ కథ ప్రకారం చెడుపై మంచి గెలిచిన దానికి సంకేతం హోలీ పండుగ అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ రజిత,ముఠామేస్త్రి గూగుల్ కమ్లి,చిన్ని,రాజమ్మ,సుగుణ, పద్మ హోలీ వేడుకల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం

### శిథిల స్థితిలో గ్రామ సరిహద్దు సూచిక బోర్డులు





**తల్లాడ, /మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):**మండల పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన గ్రామ సరిహద్దు సూచిక బోర్డులు శిథిలావస్థకు చేరుకుని ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. బోర్డులపై గ్రామాల పేర్లు స్పష్టంగా లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక సందిగ్ధంలో పడుతున్నారు.కొన్ని సందర్భాల్లో తప్పు దారిలో వెళ్లి తిరిగి రావాల్సి రావడంతో సమయాభావం ఏర్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరికొన్ని బోర్డులు పూర్తిగా వంగిపోవడం, అక్షరాలు చెరిగిపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి.ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని మండల ప్రజానికం ఆరోపిస్తోంది. వెంటనే డివిజన్ స్థాయిలో చర్యలు తీసుకుని సూచిక బోర్డులను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.ఇలాగే నిర్లక్ష్యం కొనసాగితే రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రాణ నష్టం జరిగే పరిస్థితులు తలెత్తవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## సింగరేణి సహకారంతో స్మశాన వాటిక శుభ్రత

### లయన్స్ క్లబ్ విజ్ఞప్తికి స్పందించిన అధికారులు



**సత్తుపల్లి/, మార్చి 4 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి శివారులోని హిందూ స్మశాన వాటిక పిచ్చి మొక్కలతో కమ్ముకుని అపరిశుభ్రంగా మారడంతో దహన సంస్కారాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక లయన్స్ క్లబ్ నిర్వాహకులు గోగడ రవికుమార్, మందపాటి ప్రభాకర్ రెడ్డి తదితరులు సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.వారి విజ్ఞప్తిపై స్పందించిన సింగరేణి జీఎం శ్రీనివాసరావు, ప్రాజెక్టు అధికారి ప్రహ్లాద్, మేనేజర్ రాజేశ్వరరావు తక్షణ చర్యలు తీసుకున్నారు. జేసీబీ యంత్రాలను సమకూర్చి స్మశాన వాటిక పరిసరాలను పూర్తిగా శుభ్రపరిచారు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంగణం పరిశుభ్రంగా మారి ప్రజలకు ఉపశమనం కలిగింది.

అదేవిధంగా భవిష్యత్తులో అక్కడ మట్టి పోసి, డ్రిప్ సౌకర్యం కల్పించి అందమైన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని లయన్స్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

## ఉప్పలయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన తిరుమల ప్రభాకర్ రెడ్డి.



**బయ్యారం/మార్చి 4(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల కేంద్రంలోని గంగా బజార్ చెందిన గౌని ఉప్పలయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ మంగళవారం సాయంత్రం మరణించారు.విషయం తెలుసుకున్న సోసైటీ మాజీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి గౌని ఉప్పలయ్య భౌతిక కాయానికి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరబోయిన సంపత్,సూరం సుధాకర్ రెడ్డి,పగడాల శ్రీనివాస్ గౌడ్,తమ్మిశెట్టి వెంకటపతి,పోతుగంటి సుమన్,నాశబోయిన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బయ్యారం సర్పంచ్.



**బయ్యారం/మార్చి 4(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల కేంద్రానికి చెందిన గౌని ఉప్పలయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ మంగళవారం మృతిచెందారు.విషయం తెలుసుకున్న బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతికిషన్ నాయక్ అక్కడికి చేరుకొని గౌని ఉప్పలయ్య గారి భౌతిక కాయానికి నివాళు లర్పించారు.మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ,వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉమా, వార్డు సభ్యులు ఉమాదేవి,భద్రయ్య,పులి మల్లయ్య,తుపాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

